సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం ၊ 13 ၊ జూలై ၊ 2023



ఆధిక్యంలో నెల్లూరు, చిత్తూరు జట్లు

ఏసీఏ సౌత్‌జోన్ అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు ఆధిక్యంలో ఉన్నాయి. -8లో



భూ నిర్వాసితులకు మెరుగైన పునరావాసం

ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు పునరావాస కల్పనకు చర్యలు చేపట్టినట్లు జేసీ తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1300	రూ.1440
రెండోరకం	రూ.1060	రూ.1280



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 580 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	320	470
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 181.92 కిలోలు

న్యూస్‌రీల్

జీవ వైవిధ్యంపై మూడు రోజుల శిక్షణ

రాయచోటిటౌన్: ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రాయచోటి డైట్ కేంద్రంలో జీవ వైవిధ్యంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు చెందిన పీఈటీ, పీడీలు పాల్గొనాలని కోరారు.

శెట్టిపల్లెలో పర్యటించిన జిల్లా వైద్యాధికారి



సంబేపల్లె: మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామంలో బుధవారం జిల్లా వైద్యాధికారి కొండయ్య పర్యటించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్, వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

యువ ఉత్సవ్‌ను జయప్రదం చేయండి



యువ ఉత్సవ్ పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈఓ రామపురుషోత్తం

రాయచోటి అర్బన్: ఈనెల 18న అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో నిర్వహిస్తున్న యువ ఉత్సవ్‌ను జయప్రదం చేయాలని నెహ్రూయువకేంద్రం జిల్లా యువ అధికారి కె.మణికంఠ కోరారు. మంగళవారం ఆయన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ రామపురుషోత్తంతో కలసి యువ ఉత్సవ్ పోస్టర్లను విడుదల చేశారు. మరింత సమాచారం కోసం 9177616677 నంబరులో సంప్రదించాలన్నారు. డిప్యూటీ ఈఓలు ఎం.ప్రసాద్‌బాబు, పి.నరసింహులు పాల్గొన్నారు.

బయో మెట్రిక్ అథెంటికేషన్ వందశాతం పూర్తి చేయాలి

రాయచోటి: పాఠశాలలో జగనన్న విద్యా కానుక బయోమెట్రిక్ అథెంటికేషన్ వందశాతం పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం ఆదేశించారు. బుధవారం రాయచోటి పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేవీకే చైల్డ్ ఇన్ఫో అథెంటికేషన్ పెండింగ్‌పై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, సంబంధిత వలంటీరును, పాఠశాల సిబ్బందిని కారణాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న 142 కూడా పూర్తి చేసి బయోమెట్రిక్ అథెంటికేషన్ వందశాతం చేయాలన్నారు. ఈ జెడ్పీహైస్కూలు (బాలికలు) హెచ్‌ఎం సైరా బాను, వలంటీర్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సాంకేతిక బోధన

- డిజిటల్ చదువులతో సరికొత్త అడుగులు
- ఐఎఫ్‌పీ విధానాలకు ప్రభుత్వం శ్రీకారం
- ఇకపై చాక్‌పీసులు, సుద్దముక్కలకు స్వస్తి
- 10 పాఠశాలల్లో అమలు
- ఐఎఫ్‌పీ బోధనపై 5538 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

రాయచోటి: ప్రభుత్వ బడులలో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం డిజిటల్ విద్యాబోధనకు శ్రీకారం చుట్టింది. ఇందుకు అవసరమైన అన్ని చర్యలను విద్యాశాఖ తీసుకుంటోంది. ఇప్పటికే ఉన్నత పాఠశాలలో స్మార్ట్ టీవీలతో పాటు డిజిటల్ క్లాసరూమ్(డీసీఆర్)ద్వారా బోధనను అందిస్తోంది. ఇందుకు భిన్నంగా త్వరలో సరికొత్త విధానాలతో విద్యాబోధనను సాగించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆధునిక సాంకేతికతతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) విధానాన్ని ప్రవేశపెట్టింది. అన్నమయ్య జిల్లాలో 318 పాఠశాలల్లో అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లాలో మొదటి విడతగా 164 పాఠశాలల్లో ప్యానల్స్‌ను ఏర్పాటు చేసింది. రెండవ విడతగా మిగిలిన వాటిలో ఏర్పాటుకు సిద్ధం చేస్తోంది. నాడు నేడు పథకంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిన 10 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు చేసేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. మిగిలిన వాటిలో కూడా త్వరలోనే చదువులను అందించేందుకు అన్ని చర్యలు చేపట్టింది.

ఐఎఫ్‌పీ అంటే..

- విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అధునాతన డిజిటల్ విధానంలో బోధనలను అందించేందుకు తీసుకువచ్చిందే ఈ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ప్రోగ్రాం
- ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు ఎంత కష్టతరమైన పాఠాలనైనా సులభతరంగా అర్థమయ్యేలా బోధించవచ్చు.
- ఉపాధ్యాయుడు ఏదైనా కొత్త విషయాలను విద్యార్థులకు చెప్పాలంటే గతంలో తమ ఫోన్ ద్వారా ఆ విషయాన్ని డౌన్‌లోడ్ చేసుకొని బోధించాల్సి వచ్చేది. అయితే నూతన విద్యావిధానంలో ఒక్క క్లిక్‌తో ఈ ప్యానల్‌పై ప్రపంచంలో ఏముందో పిల్లలకు కళ్ల ముందు చూపించవచ్చు.
- గణితం, సైన్స్ బోధించే సమయంలో కొన్ని చిత్రాలు బోర్డులపై గీస్తూ బోధన చేయాల్సి వస్తుంది. కానీ ఈ ప్యానల్‌పై త్రిభుజాలు, చతుర్భుజాలు, మానవ అవయవాలు తదితర ఏ చిత్రాన్నైనా ఇట్టే చూపించవచ్చు.
- మ్యాపుల ద్వారా చూపించే కొన్ని అంశాలను ఇకపై నేరుగా విద్యార్థులకు వీడియోలు, ఫొటోల ద్వారా చూపించడానికి అవకాశం ఉంది.



డిజిటల్ బోర్డుపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం (ఫైల్)

ఐఎఫ్‌పీ బోధనపై ప్రత్యేక శిక్షణ: జిల్లా పరిధిలో డిజిటల్ బోధనను విస్తరింప చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో 5538 మంది ఉపాధ్యాయులకు నాలుగు ప్రాంతాల్లో ఐఎఫ్‌పీ బోధనపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఉన్నత ప్రాథమికోన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతిలో బోధించే ఉపాధ్యాయులకు 15 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేశారు. మదనపల్లి పరిధిలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు.

చాక్‌పీసులు, సుద్దముక్కలకు స్వస్తి



పాఠశాలల్లో డిజిటల్ బోధన ఏర్పాటుతో చాక్‌పీసులు, సుద్దముక్కలకు స్వస్తి పలకాల్సి వస్తోంది. పాఠశాలల్లో ఇప్పటి వరకు బ్లాక్, గ్రీన్ బోర్డులపై సుద్దముక్కలతోనే విద్యాబోధన సాగిస్తున్నారు. విద్యార్థులకు ఏ పాఠం బోధించాలన్న ఉపాధ్యాయులు కచ్చితంగా బోర్డులపై సుద్దముక్కలతో రాయాల్సి వచ్చేది. కానీ ఇకపై డిజిటల్ బోధనలో భాగంగా నూతన విధానంతో ఐఎఫ్‌పీ విధానం అమల్లోకి వస్తే పాత పద్ధతులకు స్వస్తి పలికినట్లే. 6 నుంచి 10వ తరగతులు నిర్వహించే ప్రతి గదిలోను ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే జిల్లాలో 10 పాఠశాలల్లో 164 ప్యానెల్స్‌ను ఇన్‌స్టాల్ చేశారు.

ఇకపై బోధన మరింత సులభతరం



డిజిటల్ విద్యావిధానం ద్వారా విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధన జరుగుతుంది. దీంతో పాఠశాలల్లో చిన్నారులకు బోధన మరింత సులువుగా అర్థమయ్యేలా ఉంటుంది. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు బొమ్మల ద్వారా విపులంగా అర్థమయ్యేలా చెప్పవచ్చు. ఫలితంగా విద్యా విధానంలో నూతన ఒరవడిని సృష్టించవచ్చు. ఐఎఫ్‌పీ విధానం వలన మంచి ఫలితాలు ఉంటాయి. – సి.సుధాకర్, జిల్లా నోడల్ అధికారి

జీవితాంతం గుర్తుండిపోయేలా..



ఐఎఫ్‌పీ విధానం వలన విద్యార్థులకు జీవితాంతం గుర్తిండిపోయేలా ఉంటుంది. సినిమాను చూసిన విధంగానే పాఠ్యాంశాలను, అందులోని సారాంశాన్ని విద్యార్థులు అవపోసన పట్టే వీలుంది. విద్యార్థులు తాము చేస్తూ నేర్చుకోవడానికి ఈ విధానం బాగా పనిచేస్తుంది. చదువుకునే సమయంలో చిన్న అనుమానం వచ్చినా తక్షణం నివృత్తి చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. ప్రతి పాఠశాలను డిజిటలైజేషన్ చేస్తున్నాం. అందుకు కావాల్సిన చర్యలను త్వరితగతిన పూర్తి చేస్తున్నాము. – శ్రీరామ్‌పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

చిన్నారి వైద్యానికి ప్రభుత్వం చేయూత

లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్‌కు రూ. 10 లక్షలు మంజూరు



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ లెటరును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: చిన్నారి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్‌కు అవసరమైన రూ. 10లక్షల నిధులు మంజూరుకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చొరవచూపి ప్రభుత్వ అనుమతి ఇప్పించారు. సంబేపల్లి మండలం, ప్రకాష్ నగర్ కాలనీ ఊటుపాలెంకు చెందిన బొళ్యం సురేంద్రనాయుడు కుమారుడు మోక్షిత్ (ఒకటిన్నర సంవత్సరం వయస్సు) లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యానికి కావాల్సిన నగదు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో స్థానికుల సూచన మేరకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని సంప్రదించారు. ఎమ్మెల్యే స్పందించి వైద్యానికి అయ్యే ఖర్చుల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సీఎం సహాయనిధి నుంచి ఆసుపత్రి నివేదించిన ఆధారాల మేరకు రూ. 10 లక్షల నిధులు మంజూరు చేసేలా అనుమతిస్తూ ఆదేశాలు ఇచ్చారు. దీంతో బుధవారం రాయచోటిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంజూరైన ఎల్‌ఓసీ లెటరును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చిన్నారి మోక్షిత్ రెడ్డి తండ్రి సురేంద్ర మాట్లాడుతూ మోక్షిత్ పుట్టిన రెండు నెలల తరువాత లివర్ వ్యాధి బయటపడడంతో తిరుపతి, చెన్నైలలో వైద్యం చేయించినా మెరుగుపడలేదన్నారు. లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేస్తేనే ఆరోగ్యం మెరుగవుతుందని, ఇందుకు రూ. 10 లక్షలు ఖర్చు అవుతుందని చెన్నైలోని గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు సూచించారన్నారు. ఎమ్మెల్యేకు తమ బిడ్డ ఆరోగ్య పరిస్థితి వివరించడంతో నిధులు మంజూరు చేయించారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిల మేలు మరువలేమని వారు తెలిపారు.

నిస్వార్థ సేవలపై నిందలా!

- ప్యాకేజిస్టార్ పవన్‌కల్యాణ్‌పై భగ్గుమన్న వలంటీర్లు
- దత్తపుత్రుడి దిష్టిబొమ్మకు చెప్పు దెబ్బలతో సన్మానాలు
- మదనపల్లె సబ్ కలెక్టరేట్ వరకు ర్యాలీ, నిరసన ప్రదర్శన

మదనపల్లె: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా, ఇంటింటికి వెళ్లి నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై రాజకీయ అజ్ఞాని, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిందలు మోపడం తగదని వలంటీర్లు హెచ్చరించారు. పవన్‌కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూజారి ఉదయ్‌కుమార్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు డి.జమాల్‌వలీ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వలంటీర్ల ర్యాలీకి ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, ఎస్.కరీముల్లా, శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శీలం రమేష్, దండు రామాంజులు తదితరులు మద్దతు తెలిపారు. సబ్ కలెక్టరేట్ వద్ద వలంటీర్లు మానవహారంగా ఏర్పడి పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మకు చెప్పుదెబ్బలతో మహిళా వలంటీర్లు సన్మానాలు చేశారు. పవన్‌కల్యాణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సబ్‌కలెక్టరేట్ డీఏఓ శేషయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం మాట్లాడుతూ ఏ స్వార్థం లేకుండా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై విమర్శలు చేయడం పవన్‌కల్యాణ్‌కు తగదన్నారు. కళ్లుండీ చూడలేని గుడ్డివాడిలా పవన్‌కల్యాణ్ చంద్రబాబు మాటలన్నింటికీ తల ఊపుతూ..ఆయన రాసిచ్చింది చదువుతూ.. సంక్షేమ సారథులపై నిందలు వేయడం దుర్మార్గమన్నారు. ప్రజలతో మమేకమైన వలంటీర్ల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు చౌకబారు ఆరోపణలు చేయడం, వారిని సంఘవిద్రోహ శక్తులుగా చిత్రీకరించడం పవన్ దిగజారుడుతనాన్ని తెలుపుతోందన్నారు. జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ..వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిపారని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఇతర రాష్ట్రాల ప్రజలు పొగుడుతుంటే.. ప్యాకేజిస్టార్ పవన్‌కల్యాణ్ వారిని కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ,వార్డు వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ వలంటీర్లపై అభాండాలు వేసిన పవన్‌కల్యాణ్ తన వ్యాఖ్యలను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. రాకేష్, వలంటీర్లు భాను, సలీం, హస్మత్‌జాన్, హరి, సుదర్శన్‌రెడ్డి, మునీర్, నజీర్, ఖాదర్, ఉదయ్, నిగార్, ప్రవీణ్ పాల్గొన్నారు.



మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వలంటీర్లు



పవన్‌కల్యాణ్ ఫొటోలను దహనం చేస్తున్న వలంటీర్లు

సుండుపల్లెలో..

సుండుపల్లె(రాజంపేట): స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం జేసీఎస్ కన్వీనర్ రహిమాన్ ఖాన్ ఆధ్వర్యంలో వలంటీర్లతో కలిసి పవన్ కల్యాణ్ ఫొటోలను దహనం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఇన్‌చార్జి రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం: జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆకేపాటి

పెనగలూరు: ఆంధ్రప్రదేశ్‌లోని వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఈటమాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వలంటరీ వ్యవస్థను కొంతమంది నాయకులు విమర్శించడం తగదన్నారు. రాష్ట్రంలో ఏ కుటుంబానికి ఏ అవసరముందో వలంటరీ వ్యవస్థ ప్రభుత్వానికి తెలియజేస్తుందన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులుగా ఉన్న వారందరికీ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందేందుకు జగనన్న సురక్ష పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పారిశ్రామికవేత్త బత్తిన పెద్దగుండాల్ రెడ్డి, పెంచలకోన ఆలయ ట్రస్టు చైర్మన్ తిరుపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఓబులవారిపల్లి ఎంపీపీ తిరుపాలు, జెడ్పీటీసీ లక్ష్మీనరసయ్య, రాజంపేట జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ రాక

పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, జేసీ, ఎస్పీ



కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ముంతాజ్‌అలీతో చర్చిస్తున్న కలెక్టర్,ఎస్పీ, ఎమ్మెల్యే

మదనపల్లె: కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ గురువారం అన్నమయ్యజిల్లా మదనపల్లెకు రానున్నారు. తిరుపతి ఎయిర్‌పోర్ట్ నుంచి మధ్యాహ్నం 1.20 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 2.00 గంటలకు మదనపల్లె బీటీ కళాశాల గ్రౌండ్స్‌లోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ ఆయనకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లుభవనాలశాఖ మంత్రి దాడిశెట్టిరాజా, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, కలెక్టర్ గిరీషా పీఎస్., జేసీ ఫర్మాన్ అహ్మద్, ఎస్పీ గంగాధరరావు తదితరులు స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి 2.15 నిమిషాలకు కేంద్రమంత్రి నక్కలదిన్నెలోని సత్సంగ్ ఫౌండేషన్‌కు చేరుకుంటారు. పద్మభూషణ్ ముంతాజ్‌అలీ(శ్రీఎం) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన స్వాస్థ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 4.10 నిమిషాలకు తిరుపతి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని ప్రత్యేక విమానంలో నాగపూర్‌కు తిరుగు పయనం కానున్నారు. కేంద్రమంత్రి పర్యటించే ప్రాంతాలను ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి కలెక్టర్ గిరీషా పీఎస్., జేసీ ఫర్మాన్ అహ్మద్, ఎస్పీ గంగాధరరావు, ఆర్డీఓ మురళీ తదితరులు బుధవారం పరిశీలించారు.

కాకర సాగు.. ఆదాయం బాగు!

- ఈ ఏడాది కాకరకు మంచి గిట్టుబాటు ధరలు
- మార్కెట్లో కిలో కాకర ధర రూ.56–60
- కర్ణాటక, తమిళనాడుకు తరలుతున్న పంట
- లాభాల బాటలో రైతులు

గుర్రంకొండ: జిల్లాలో కాకర తోటల పెంపకం చేపట్టిన రైతులు లాభాల బాట పడుతున్నారు. మార్కెట్లో టమాటా, వంగతో పాటు కాకర పంట సాగు రైతులకు మంచి గిట్టుబాటు ధరలు కల్పించింది. ఈ ఏడాది కాకరకు మంచి డిమాండ్ ఉండడంతో మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.. ప్రస్తుతం మార్కెట్లో కిలో కాకర ధర రూ.56 నుంచి రూ.60 వరకు ధరలు పలుకుతుండడం గమనార్హం. కాకరలో మంచి పోషక విలువలతోపాటు షుగర్ వ్యాధి గ్రస్తులకు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. దీంతో మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం కాకరకు మంచి డిమాండ్ ఉంది.

జిల్లాలో 1215 హెక్టార్లలో సాగు

జిల్లాలో ఈ సీజన్‌లో 1215 హెక్టార్లలో కాకర తోటల సాగు చేపట్టారు. ఎకరం కాకర సాగుకు దుక్కుల దగ్గర నుంచి కాయలు కోతకు వచ్చేంత వరకు రూ.70 వేలు నుంచి రూ.90వేల వరకు ఖర్చు వస్తుంది. చెట్టు ఎదుగుదలకు, పూతపిందె నిలవడానికి పదిరోజులకొకసారి మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. చెట్టుకు సత్తువ ఇచ్చి కాయలు ఎక్కువ కాయడానికి వైరస్‌లు, ఇతర పురుగుల నివారణ మందుల కోసం ప్రతి వారం సుమారు రూ. 10 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన 45 నుంచి 50 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. సుమారు 45 రోజుల పాటు కాయల కోత ఉంటుంది. ఇతర పంటలతో పోల్చితే 3నెలల్లోపే పంట కాలం మొత్తం పూర్తి కావడం కాకర ప్రత్యేకత.



గుర్రంకొండ మండలం ఎనుగొండపాలెం మార్గం వద్ద సాగు చేసిన కాకర తోటలు



రవాణాకు సిద్ధంగా ఉంచిన కాకరకాయలు

ఎకరానికి రూ.3.60 లక్షలనుంచి రూ.4.20 లక్షలు ఆదాయం

ప్రస్తుత సీజన్‌లో కాకర తోటలు సాగు చే స్తే మంచి దిగుబడి వస్తుంది. తద్వారా ఎకరానికి కనీసం రూ.3.60 లక్షల నుంచి గరిష్టంగా రూ.4.20 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఎకరానికి 6 నుంచి 7టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో కాకర రూ.56 నుంచి రూ.60 వరకు ధరలు పలుకుతున్నాయి. మార్కెట్లో మొదటి రకం కిలో రూ. 60, రెండో రకం కిలో రూ. 45, మూడో రకం కిలో రూ.30 వరకు ఉంది. ఈ లెక్కన ఎకరానికి రూ. 3.60 లక్షలు నుంచి రూ.4.20లక్షల వరకు ఆదాయం వస్తుంది. గత పదిహేను రోజులుగా ఇవే ధరలు మార్కెట్లో నిలకడగా ఉండడంతో రైతులు లాభాల బాట పడుతున్నారు.

ఈ ఏడాది కాకరకు మంచి గిట్టుబాటు ధరలు

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది కాకరకు మార్కెట్లో మంచి గిట్టుబాటు ధరలు ఉన్నాయి. కాకర తోటలు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో ఎక్కువగా చేపట్టరు. దీంతో మన జిల్లాలో సాగు చేసే కాకరకు అక్కడి రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. అక్కడి మార్కెట్లలో కాకరకు మంచి గిట్టుబాటు ధరలు ఉన్నాయి.

బెంగళూరు, చెన్నైలో మంచి డిమాండ్

మన జిల్లాలో సాగు చేసే కాకరకు బెంగళూరు, చెన్నైలో మంచి డిమాండ్ ఉంటుంది. కాకరలో పోషక విలువలు ఉంటాయనేది అందరి నమ్మకం దీంతో ఇక్కడ సాగు చేసే కాకరను తిరుపతి, కడప, చెన్నై, బెంగళూరు మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం కోత కూలీలు, రవాణాఖర్చులు, పెట్టుబడి సాగు ఖర్చులు పోనూ రైతులు లాభాలు చవిచూస్తున్నారు.

కాకరకు గిట్టుబాటు ధరలు



ప్రస్తుతం టమాటా, వంగ పంటలతో పాటు కాకరతోటల సాగు లాభసాటిగా ఉంది. టమాటాకు ప్రత్యామ్నాయంగా కాకర పంట సాగు మమ్మల్ని ఆదుకొంటోంది. టామాటాతో పోల్చుకొంటే పదిహేను రోజులుగా మార్కెట్లో కాకర ధరలు నిలకడగా ఉన్నాయి. మార్కెట్లో ధరలు ఇలాగే ఉంటే మంచి లాభాలు రావచ్చు. ఎంతలేదన్నా ఎకరానికి అన్ని ఖర్చులు పోనూ రూ. 3 లక్షల పైనే ఆదాయం వచ్చే అవకాశముంది. – నరసయ్య, గంగసపల్లె

రెండున్నర ఎకరాల్లో సాగు చేశా

రెండున్నర ఎకరాల్లో కాకరతోటలు సాగు చేశాను. నిన్నటి సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది మార్కెట్లో కాకర ధరలు బాగానే ఉన్నాయి. టమాటాతో పాటు కాకరకు మంచి గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. మూడు నెలల్లో పంట కాలం ముగియడం కాకర ప్రత్యేకత. మార్కెట్లో కొద్దిరోజులుగా ధరలు నిలకడగా ఉండడంతో పెట్టుబడి ఖర్చుపోను లాభాలు చూస్తాము. – రమణయ్య, రైతు, ఎం. కొత్తపల్లె

రేణిగుంట వరకే తిరుమల ఎక్స్‌ప్రెస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా కడప–విశాఖ–కడప మధ్య తిరుగుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రేణిగుంట మీదుగా విశాఖకు వెళుతుందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈనెల 12 నుంచి ఆగస్టు 10 వరకు రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. అలాగే విశాఖపట్టణం–కడప (17488) మధ్య తిరిగే ఈరైలు ఈనెల 11 నుంచి ఆగస్టు 10 వరకు తిరుపతికి వెళ్లకుండా రేణిగుంట మీదుగానే నడుస్తుందన్నారు. తిరుపతి–హుబ్లీ–తిరుపతి (07657/58) రైలు ఆగస్టు 10వ తేదీ వరకు రేణిగుంట వరకే నడుస్తుందన్నారు. వీటితోపాటు తిరుపతికి వెళ్లాల్సిన మరి కొన్ని రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని దారి మళ్లించారని పేర్కొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

కడప సెవెన్‌రోడ్స్: కారుణ్య నియామకాల కింద జిల్లా పరిషత్‌లో ఉద్యోగాల కోసం 61 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల వీరిలో ఇద్దరికి అవకాశం కల్పించారు.

క్లుప్తంగా

అట్రాసిటీ నమోదు అన్యాయం

సిద్ధవటం : భూవివాదంలో సిద్దవటం వాసులైన అహ్మద్‌హుస్సేన్, షామీర్ హుసేన్, హిదయాతుల్లాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సిద్దవటం మండల కన్వీనర్ భక్తుడు అన్నారు. బుధవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే వారిపై కేసులు పెట్టారన్నారు. తాము కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ డీఎస్పీని కలుస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సేవాదళ్ జనరల్ సెక్రెటరీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల జనరల్ సెకరేటరీలు బాలు, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడు అరెస్టు


విజయ్‌కుమార్(ఫైల్)

ములకలచెరువు : ఒంటరిగా ఇంట్లో ఉన్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు విజయ్ కుమార్(30)పై ఎస్‌ఐ గాయత్రి పోక్సో కేసు నమోదు చేసిన విషయం విధితమే. ఈ కేసులో నిందితుడు బుధవారం తంబళ్లపల్లె క్రాస్ వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొన్న కారు

– ఆరుగురికి గాయాలు

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని మండల పరిధిలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆగి ఉన్న లారీని కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఫయజూర్ రహిమాన్, సమీరా, ఆలియాతో పాటు మరో ముగ్గురు చిన్నారులకు గాయాలైనట్లు రామాపురం ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. వివరాలు రాయచోటి పట్టణం బోస్‌నగర్‌కు చెందిన ఫయజూర్ రహిమాన్, సమీరా, ఆలియా, ముగ్గురు పిల్లలతో కలిసి ఏపీ04ఏబి 5588 కారులో కడప నుంచి రాయచోటి వైపునకు వెళ్తుండగా మార్గమధ్యలో పాలన్నగారిపల్లె సమీపంలో రాగానే రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలవ్వడంతో వారిని 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రహిమాన్, సమీరాలను వేలూరుకు, ఆలియాను తిరుపతికి మెరుగైన చికిత్స కోసం తరలించారు.

ఆధిక్యంలో నెల్లూరు, చిత్తూరు జట్లు


తలపడుతున్న కడప, నెల్లూరు జట్లు (ఇన్‌సెట్) 129 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ షావుల్ హమీద్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో రెండోరోజు మ్యాచ్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 56 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు రెండోరోజు బుధవారం 101 ఓవర్లలో 366 పరుగుల వద్ద ఆలౌటైంది. జట్టులోని ఎస్. షావుల్‌హమీద్ 129 పరుగులు, మన్విత్‌రెడ్డి 83 పరుగులు చేశారు. కడప బౌలర్లు మహమ్మద్ అస్లాం 3, సాయి అర్థిత్‌రెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లు నిర్వహించగా, ఒక్క పరుగు లభించలేదు. ఓపెనర్లు ఇద్దరూ బరిలో ఉన్నారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో చిత్తూరు, అనంతపురం మ్యాచ్‌లో రెండోరోజు బుధవారం 130 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 56.3 ఓవర్లలో 253 పరుగులు చేసి ఆలౌటైంది. జట్టులోని ప్రశాంత్ 79 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ మహమ్మద్ ఇర్ఫాన్ 3, బాలాజీ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 62.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 54 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు ప్రదీప్‌రెడ్డి 3, లీలాసాయి 3 వికెట్లు తీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

ఐటీఐల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న కన్వీనర్ శ్రీనివాసరావు

రాజంపేట టౌన్ : జిల్లాలోని మూడు ప్రభుత్వ, పన్నెండు ప్రైవేట్ ఐటీఐలలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈనెల 31వ తేదీలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్, రాజంపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో తొలివిడత కౌన్సెలింగ్ పూర్తయ్యాక ప్రభుత్వ ఐటీఐల విభాగంలో వివిధ ట్రేడ్‌లకు సంబంధించి 341 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో రాజంపేట ప్రభుత్వ ఐటీఐలో 128 సీట్లు, పీలేరు ప్రభుత్వ ఐటీఐలో 115, తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో 98 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈసీట్లను రిజర్వేషన్ కేటగిరీ మేరకు భర్తీ చేస్తామన్నారు. టెన్త్ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు ఒకటవ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు అభ్యర్థులు ఏ ఐటీఐలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారో ఆ ఐటీఐలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అభ్యర్థులు ఆగస్టు 3, 4వ తేదీల్లో ఆయా ఐటీఐల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అలాగే ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశం కోసం అభ్యర్థులు ఆగస్టు 5, 7వ తేదీల్లో వారు దరఖాస్తు చేసుకున్న ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ప్రత్యేకంగా కాల్‌లెటర్స్ పంపరని, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

తాత్కాలిక మెడికల్ కళాశాల ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న సూపరిండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి తదితరులు

మదనపల్లె : మదనపల్లె మెడికల్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తాత్కాలిక గదుల నిర్మాణాలకు సంబంధించి మేఘా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం భూమిపూజ నిర్వహించారు. మేఘా ఇంజినీర్ వర్క్స్ జీఎం కమలాకర్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరిండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి, ఏపీఎంఎస్ఐడీసీ డీఈ కరీముల్లాఖాన్ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.11.4 కోట్ల వ్యయంతో 35,000 చదరపు అడుగుల్లో అదనపు గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక తాత్కాలికంగా మెడికల్ కళాశాలను జిల్లా ఆస్పత్రిలో ప్రారంభించి, ఆరోగ్యవరం వద్ద శాశ్వత భవనాల నిర్మాణం జరిగాక అక్కడకు మారుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ ప్రసాద్‌రాజు, సివిల్‌సర్జన్ హరగోపాల్, పాల్ రవికుమార్, నర్సింగ్ సూపరిండెంట్ నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు మెరుగైన పునరావాసం

జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్


ముదివేడు రిజర్వాయర్ ఆర్ అండ్ ఆర్ కాలనీపై చర్చిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్

కురబలకోట : కురబలకోట,బి.కొత్తకోట మండలాల్లోని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు త్వరలో భూ పరిహారం చెల్లింపు, పునరావాస కల్పనకు ముమ్మర చర్యలు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం ముదివేడు సచివాలయంలో బాధిత రైతులు, అధికారులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం చెల్లింపు కోసం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ. వంద కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. త్వరలో నిర్వాసితుల ఖాతాలకు జమ కానున్నాయన్నారు. ఎకరాకు రూ.పన్నెండునర లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తారన్నారు. మరో వైపు పునరావాస కల్పనలో భాగంగా ముదివేడు ఫారెస్టు మార్గంలోని ఎంబీజీ లే అవుట్ పక్కన కురబలకోట మండలంలోని నిర్వాసితుల ఆర్ అండ్ఆర్ కాలనీకి 30 ఎకరాలు సేకరించారన్నారు. లే అవుట్ పనులు ప్రారంభిస్తారన్నారు. బి.కొత్తకోట మండలంలో కాండ్లమడుగు క్రాస్ వద్ద కేటాయించారన్నారు. లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయించినట్లు చెప్పారు. రిజర్వాయర్‌కు ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె, కోటావూరు, గుడి, బడి, తాగునీరు, మురికినీటి కాలువలు, ఆసపత్రి, పశువుల ఆసుపత్రి, కమ్యూనిటీ హాల్, విశాలమైన రోడ్లు, సచివాలయం, ఏటీఎంతో పాటు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. డ్వాక్రా గ్రూపుల సమావేశాలకు కమ్యూనిటీ భవనం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి బాధితుడికి ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు పక్కా ఇళ్ళు నిర్మించనున్నట్లు చెప్పారు.సొంతంగా కూడా కట్టుకోవచ్చన్నారు. లేదంటే ఓటీఎస్ కింద రూ. 8. 60 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు అదనంగా మరో రూ. 50 వేలు ఇస్తారన్నారు. బాధిత రైతులకు సంతృప్తికరంగా పునరావాసం ఉంటుందన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీకి భూములిస్తున్న రైతులతో కూడా మాట్లాడారు. అంతకు ముందు ఆయన ముదివేడు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎన్ఎస్ పీలేరు యూనిట్–2 స్పెషల్ ఆఫీసర్ గోపాలకృష్ణ, తహశీల్దారు మల్లంపల్లె భీమేశ్వరరావు, ఎంపీడీఓ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

మదనపల్లె టమాట మార్కెట్లో ఎన్‌సీఎఫ్ఐ కొనుగోళ్లు

మదనపల్లె : టమాట క్రయ,విక్రయాలకు దేశంలోనే పేరుమోసిన మదనపల్లె టమాట మార్కెట్ యార్డులో బుధవారం నేషనల్ కన్స్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌సీఎఫ్ఐ) టమాట కొనుగోళ్లు చేపట్టింది. బుధవారం ఉదయం జరిగిన వేలంపాటల్లో ఎన్‌సీఎఫ్ఐకు చెందిన నితిన్ కిలో టమాటా రూ.120 చొప్పున 23 టన్నులు, అలాగే అంగళ్లు మార్కెట్‌యార్డులోనూ 23 టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటిని ఢిల్లీ, లక్నోకు తరలించి అక్కడ రూ.60 సబ్సిడీ ధరతో వినియోగదారులకు విక్రయిస్తామన్నారు. మదనపల్లె, అంగళ్లు మార్కెట్లలో ఎన్‌సీఎఫ్ఐ టమాట కొనుగోళ్లకు స్థానిక మండీ యజమాని ఎస్.ఏ.మస్తాన్ సహకారం అందించారు. అలాగే కేంద్రప్రభుత్వ సంస్థ నాఫెడ్ మదనపల్లెలో టమాట కొనుగోళ్లకు సంబంధించి తమతో సంప్రదింపులు జరుపుతోందని మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్ తెలిపారు. ఉత్తరాది రాష్ట్రాల్లో తీవ్ర వర్షపాతం, పంటనష్టంతో దేశవ్యాప్తంగా టమాట పంటకు డిమాండ్ పెరగడంతో అందరిదృష్టి ఏడాది పొడవునా టమాటా విక్రయాలు జరిగే మదనపల్లెపై పడింది. బుధవారం మదనపల్లె మార్కెట్‌కు రైతులు మొత్తం 580 మెట్రిక్‌టన్నుల టమాటాను తీసుకురాగా, మొదటిరకం కిలో రూ.130–144 వరకు, రెండోరకం కిలో రూ.106–128 మధ్య ధర పలికింది.

నిందితుల కోసం ప్రత్యేక బృందాలు


హత్యాస్థలంలో పరిశీలిస్తున్న తాలూకా సీఐ సత్యనారాయణ, పోలీసులు.

మదనపల్లె : మండలంలోని బోడుమల్లుదిన్నెలో హత్యకు గురైన టమాటా రైతు నారెం రాజశేఖర్‌రెడ్డి కేసుకు సంబంధించి ఘటనాస్థలంలో బుధవారం డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు సేకరించారు. కాగా హత్యాస్థలాన్ని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ కేశప్ప, తాలూకా సీఐ సత్యనారాయణ పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు ఆధారాలను సేకరించారు. మృతదేహానికి స్థానిక జిల్లా ఆస్పత్రిలో శవపంచనామా నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ.. హత్యకు గల కారణాలను విచారిస్తున్నామని, అందులో భాగంగా హత్య జరగడానికి ముందురోజు జరిగిన విషయాలను కుటుంబసభ్యుల నుంచి తెలుసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుల గాలింపునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామన్నారు. హత్యఘటనలో ఎందరు పాల్గొన్నారన్న అంశంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించినట్లు డీఎస్పీ చెప్పారు.

టెండరు నోటీసు

నెం. 27 to 52/2023-24			తేది: 12-07-2023
పులివెందుల పురపాలక సంఘము నందు అభివృద్ధి పనులకు సంబంధించి దిగువ తెలిపిన మేరకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది.			
వ. నెం.	టెండరు నోటీసు నెం	పనుల సంఖ్య	అంచనా మొత్తము
1	27 to 44/2023-24 PADA Grants	18	రూ. 421.95 లక్షలు
2	45/2023-24 15th Finance Commission Grant	1	రూ. 25.07 లక్షలు
3	46/2023-24 State Finance Commission Grant	1	రూ. 16.00 లక్షలు
4	47 to 52/2023-24 General Funds	6	రూ. 15.20 లక్షలు

బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడింగ్ ప్రారంభపు తేది :14-07-2023 సా. 6.00 గంటల నుండి
బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడింగ్ ముగింపు తేది :31-07-2023 మ. 3.00 గం.ల వరకు
బిడ్స్ స్వీకరణ చివర తేది : 31-07-2023 మ. 3.30 గంటలకు
బిడ్స్ తెరచు తేది : 31-07-2023 సా. 4.30 గంటలకు
పై పనులకు సంబంధించి టెండర్ల పని వివరములు మరియు తదితర వివరములు సంబంధిత అధికారులను ఆఫీసు పనివేళలలో సంప్రదించవలెయును.

కమీషనరు, పులివెందుల పురపాలక సంఘము

గుర్రంకొండలో నిఘా పటిష్టం చేయాలి

• ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు • ఎస్పీ గంగాధర్‌రావ్


ట్రాఫిక్ సమస్య నివరాణకు సూచనిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావ్

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంతో పాటు మండల సరిహద్దు వరకు ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారిలో నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావ్ అన్నారు. బుధవారం గుర్రంకొండలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన వేగనిరోధక స్టాపర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుర్రంకొండతో పాటు మండల సరిహద్దు గ్రామం మొటుకు క్రాస్‌వరకు సీసీకెమెరాల నిఘాను పటిష్టం చేయాలన్నారు. ఇటివల నెలరోజులుగా ఈ మార్గంలో ఎక్కువగా రోడ్డుప్రమాదాలు జరగుతున్నాయన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన 24 వేగనిరోధక స్టాపర్లతోపాటు ఇంకా పలుచోట్ల వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణంలో మరమ్మతుకు గురైన సీసీ కెమెరాలను వెంటనే మరమ్మతు చేయించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పట్టణంలో మైనర్ల డ్రైవింగ్‌పై దృష్టి సారించాలన్నారు. నిబంధనలన ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లు, గంజాయి ముఠా సభ్యుల కదిలకలపై నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ దిలీప్ కుమార్, ఏఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు,లారీ ఢీ

నలుగురు చిన్నారులు సహా ఏడుగురికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన నాగరాజు, శోభ


గాయపడిన ఆశ, చిన్నారులు


బి.కొత్తకోట : బోయకొండ అమ్మవారి దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న కుటుంబం ప్రయాణిస్తున్న కారుకు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ముగ్గురు తీవ్రంగా, నలుగురు స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. కారును లారీ ఢీకొన్న సంఘటన బుధవారం సాయంత్రం బి.కొత్తకోట మండలం కోటిరెడ్డిగారిపల్లె వద్ద జరిగింది. బాధితులు, ఎస్‌ఐ రామమోహన్ కథనం మేరకు వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు కేఆర్‌పురానికి చెందిన నాగరాజు (65) బోయకొండ గంగమ్మను దర్శించుకోవడం కోసం బుధవారం కారులో బయలుదేరాడు. కర్ణాటక చేలూరులో ఉంటున్న రెండోకుమార్తె ఆశ (24), ఆమె పిల్లలను, అక్కడినుంచి ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ తంబాకోల్లపల్లెలో ఉంటున్న మొదటి కుమార్తె శోభ(26), ఆమె పిల్లలను తీసుకుని కారులో బోయకొండకు వెళ్లారు. అక్కడ అమ్మవారి దర్శనం అయ్యాక కేఆర్‌పురం వెళ్లాల్సిన నాగరాజు..మొదట తంబాకోళ్లపల్లె, తర్వాత చేలూరుల్లో కుమార్తెలను వదిలి వెళ్దామని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై మండలంలోని శీలంవారిపల్లె పంచాయతీ కోటిరెడ్డిగారిపల్లె వద్దకు రాగానే పెనుగొండ నుంచి చెన్నై వెళ్తున్న లారీ.. కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నాగరాజు (65), ఇతని కుమార్తెలు శోభ (26), ఆశ (24)లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి పిల్లలు రక్షిత (6), గిరిజ (4), జితేంద్ర (6), అనిల్ (13)లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి వెళ్లాలని వైద్యులు సూచించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రామమోహన్ పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు జగనన్న అమ్మ ఒడి మెగా చెక్కు పంపిణీ

– ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ గిరీషా, ఎస్పీ గంగాధరరావు

మదనపల్లె : పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువులకు దూరం కారాదనే సంకల్పంతో బడికి వెళ్లే విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు ప్రవేశపెట్టిన జగనన్న అమ్మ ఒడి నాలుగో విడత నిధుల విడుదలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి ప్రత్యేక సమావేశం గురువారం మదనపల్లెలో జరగనుంది. గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మదనపల్లెలో పాల్గొన్న విద్యాదీవెన కార్యక్రమానికి సంబంధించి చేసిన స్థాయిలో జగనన్న అమ్మ ఒడి మెగా చెక్కు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. కదిరిరోడ్డులోని నీరుగట్టువారిపల్లె టిప్పుసుల్తాన్ మైదానంలో ఉదయం.10 గంటలకు జరగనున్న కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి దాడిశెట్టిరాజా, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా సుమారు పదిహేను వేలమంది విద్యార్థులు, ఐదువేలమంది తల్లిదండ్రులు మొత్తం కలిపి 20వేల మంది వరకు సమావేశానికి హాజరుకావచ్చన్న అంచనాతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి కలెక్టర్ గిరీషా, జేసీ ఫర్మాన్ అహ్మద్, ఎస్పీ గంగాధరరావు, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ తదితరులు బహిరంగ సభా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, వార్డు కౌన్సిలర్లు, కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, డీఎస్పీ కేశప్ప, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, ఎన్.ఇర్ఫాన్‌ఖాన్, శీలంరమేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి

ప్రొద్దుటూరు : నిబంధనలను ఉల్లంఘిస్తే చౌకదుకాణాల డీలర్లు, ఎండీయూలపైన చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో బుధవారం చౌకదుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, ఐసీడీఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నిత్యావసర వస్తువులను అందించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కందిపప్పు కిలో ధర రూ.67, అరకేజి చెక్కర ప్యాకెట్ రూ.17.50 తీసుకోవాలని, కొంత మంది డీలర్లు చిల్లర లేదని కంది పప్పుకు రూ.70, చెక్కరకు రూ.20 తీసుకుంటారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. బియ్యం కొనడం చట్ట విరుద్ధమైన చర్య అని తెలిపారు. త్వరలో ఎండీయూ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పనిమీద వెళ్లాలనుకుంటే క్యాజువల్ లీవ్ పెట్టి వెళ్లవచ్చునని, అటెండెన్స్ రిజిస్టర్‌లో ధర్నాకు వెళుతున్నామని రాస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు.

బాకీ విషయమై యువకుడి కిడ్నాప్‌నకు యత్నం

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని పాలెం గొల్లపల్లెకు చుట్టం చూపుగా వచ్చిన రాజంపేట మండలం రోళ్లమడుగు గ్రామం ఎగులపల్లెకు చెందిన ప్రసాద్ అనే యువకుడిని బాకీ విషయమై నలుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనాల్లో కిడ్నాపునకు యత్నించడంతో గమనించిన గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆ నలుగురు వ్యక్తులు ప్రసాదనే వ్యక్తిని చీకట్లోకి తీసుకెళ్లి కొట్టడంతో స్థానికులు అతన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక వైద్యులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రసాద్‌ను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన నలుగురు వ్యక్తుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని లక్కిరెడ్డిపల్లి ఎస్‌ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

టీడీపీలో ఫ్లెక్సీల రగడ

బత్యాల, చమర్తి మధ్య ఆధిపత్యపోరు


బత్యాల వర్గీయులు చించేసిన ఫ్లెక్సీలు

రాజంపేట రూరల్ : ఆధిపత్య పోరు, అసూయతో ఫ్లెక్సీలు చించివేయడంలో పోటీ పడటంతో రాజంపేటలో టీడీపీ నవ్వుల పాలైంది. రాష్ట వ్యాప్తంగా టీడీపీ చేపడుతున్న బస్సుయాత్ర బుధవారం రాజంపేట మీదుగా కొనసాగింది. ఇందుకు అనుగుణంగా రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్యాల చెంగల్‌రాయుడు ఆర్ఎస్ రోడ్ వెంట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో టీడీపీ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న విద్యావేత్త చమర్తి జగన్‌మోహన్‌రాజు అనుచరులు అధిక సంఖ్యలో ఎస్ఆర్ పాళెం వద్ద నుంచి పట్టంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు 163 ఫ్లెక్సీలను నిర్మించేందుకు మంగళవారం నుంచి సన్నాహలు చేపట్టారు. పార్టీలో చమర్తి ఎదుగుదలను ఓర్చుకోలేని బత్యాల వారు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను చింపివేయాలని అనుచరులను ఆదేశించినట్లు చమర్తి వర్గీయులకు సమాచారం అందింది. మంగళవారం రాత్రి చమర్తి వర్గీయులు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను చింపివేసేందుకు బత్యాల పీఏ కొందరితో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకొని వాటిని చింపి పడగొట్టారు. ఇది గమనించిన చమర్తి వర్గీయులు అడ్డుపడటంతో దాడికి దిగారు. ఇదే సమయంలో ఇరువర్గాల వారు కొట్టుకున్నారు. తిరిగి చమర్తి వర్గీయులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం బస్సుయాత్రకు స్వాగతం చెప్పేందుకు ఇరు వర్గాలతో పాటు పార్టీ సానుభూతి పరులు, అభిమానులు బ్రాహ్మణపల్లె వద్దకు చేరుకున్నారు. ఇక్కడ నుంచి బత్యాల రాజకీయం ఊపందుకుంది. రైల్వేకోడూరు నుంచి అనుచరులను, తన సామాజిక వర్గం వారిని బత్యాల రప్పించారు. వారు చమర్తి వర్గీయులను రెచ్చగొడుతూ బీసీఆర్ జిందాబాద్ అని నినదించారు. అందుకు ఏమాత్రం తగ్గని చమర్తి వర్గీయులు జగన్‌మోహన్‌రాజు జిందాబాద్ అంటూ నినదించారు. ఇదే సమయంలో ఇరువర్గాల వారు దాడి చేసుకున్నారు. పోలీసులు సర్దిచెప్పి పంపారు. అయితే బస్సుయాత్రలో పాల్గొనే వారికి బత్యాల కూచివారిపల్లి వద్ద ఉన్న కల్యాణ మండపంలో భోజనాలు ఏర్పాటు చేస్తే.. చమర్తి ఆర్ఎస్ రోడ్‌లోని ఎల్ఐసీ పక్కన ఏర్పాటు చేశారు. చమర్తి ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇది జీర్ణించుకోలేని బత్యాల తన వర్గీయుల చేత మాజీ శాసనమండలి చైర్మన్ షరీఫ్‌కు పూల దండలు వేసేందుకు వచ్చిన చమర్తి వర్గీయులను అడ్డగించారు. షరీఫ్ ఎదుటే మరోసారీ తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. పోలీసుల జోక్యంతో వెనుదిరిగిన తమ్ముళ్లు జాతీయ రహదారిపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించేందుకు వచ్చిన చమర్తి వర్గీయులను అడ్డగించడంతో ఘర్షణ పడ్డారు. రాజంపేటలో ఎప్పుడూ లేని రాజకీయ సంస్కృతి బత్యాల తీసుకొచ్చాడని టీడీపీ అభిమానులు వాపోతున్నారు.